"ఏముంది? పందుల కొట్టంలోకి వెళ్ళి, మోకాళ్ళ మీద కూర్చుని నీ తప్పులని క్షమించమని వాటిని ప్రార్థిస్తే సరి." సూచించాడు గురువు

"ఛ! నేనా పని ఎలా చేయగలను? నా బంధు మిత్రులు, ఇరుగు పొరుగు ముందు నాకు సిగ్గుగా వుండదా?"

వారం రోజుల తర్వాత అతను తిరిగి ఆ గురువుని కలిసి అడిగాడు.

"మీరు చెప్పినట్లు చేస్తే నేను తప్పక స్వర్గానికి వెళ్తానా?"

"వెళ్తావు." హామీ ఇచ్చాడు గురువు.

"అయితే సరే." అని అతను బయటకి వెళ్ళబోతూంటే వెంటనే గురువు అతనితో ఇలా చెప్పాడు.

"పందుల్ని ప్రార్థిస్తే ఇతరులు నిన్ను చూసి నవ్వుతారన్న అహం నీలో చచ్చింది. అది చాలు నువ్వు తప్పక స్వర్గానికి వెళ్ళడానికి. ఇక వాటిని ప్రార్థించనవసరం లేదు."

## 130. ప్రశ్న - జవాబు

రామ శర్మ, కృష్ణ వర్మలు ఇద్దరూ దైవ భక్తులు. వారిద్దరికీ సిగరెట్ తాగే అలవాటుంది. దాంతో తమకి వున్న చెడ్డ అలవాటు వల్ల జరిగే అనర్థం గురించి తెలుసుకోడానికి రామ శర్మ వెళ్ళి మఠంలోని స్వామిని అడిగాడు.

"స్వామీ! నేను శివపంచాక్షరీ మంత్రం జపిస్తూండగా సిగరెట్ తాగచ్చా?"

"ఊహు. అలా చేస్తే అది మన దైవాన్ని అవమానించడమే అవుతుంది."

రామ శర్మ ఆ సమాధానాన్ని వచ్చి కృష్ణ వర్మకి చెప్పి చెప్పాడు.

"మనం జపమైనా మానాలి. లేదా సిగరెట్లయినా మానాలి."

కృష్ణ వర్మ వెంటనే మఠానికి వెళ్ళి స్వామిని అడిగాడు.

"స్వామి! నేను సిగరెట్ తాగుతూండగా కూడా మంత్ర జపం చేసుకోవచ్చా?"

"తప్పకుండా చేసుకోవచ్చు. జపాన్ని అన్ని వేళల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు చేసుకోవచ్చు."

నీతి: మనకి వచ్చే సమాధానం మనం అడిగే ప్రశ్న కోణాన్ని బట్టి వుంటుంది కాబట్టి ఎదుటి వారికి ఏ దృష్టితో అడిగారో తెలుసుకుని తగిన జవాబు చెప్పాలి.

## 131. తప్పక లభించే బహుమతి

పూర్వం ఓ వేశ్య బాగ్దాద్ నగరంలోని రాజ వీధుల్లో వెళ్తూ దాహంతో మరణానికి సిద్ధంగా ఉన్న ఓ కుక్కని చూసింది. ఆమె వెంటనే తన కాలికి ఉన్న తోలుతో చేసిన సాక్‌ని విప్పింది. తన నెత్తి మీద ఉన్న సిల్క్ ఆచ్ఛాదనని కూడా విప్పి ఆ సాక్‌కి కట్టింది. వాటిల్తో దగ్గరే ఉన్న బావిలోంచి నీళ్ళని తోడి తీసుకువచ్చి ఆ కుక్కకి నీళ్ళు పట్టి దాన్ని బ్రతికించింది.

దయతో చేసిన ఆ ఒక్క సహాయంతో ఆమె చేసిన పాపాలన్నీ భస్మం అయాయి. సాటి జీవులకి, తోటి మనుషులకి దయతో చేసే సహాయానికి తగిన బహుమతి తప్పక లభించి తీరుతుంది.

## 132. నిజమైన భక్తి

ఓ మఠాధిపతి దగ్గరకి వచ్చిన ఒకామె అడిగింది.

"స్వామి! నేను పుట్టు గుడ్డిని. కొందరు స్నేహితురాళ్ళు నాకు దేవుడి మీద నిజమైన భక్తి ఉంటే, అతను నాకు చూపు తెప్పిస్తాడని అంటున్నారు. ఇది నిజమే అయితే నాకు భక్తి లేనట్లా?"

వెంటనే మఠాధిపతి అడిగాడు.

"గుడ్డివాళ్ళందరి దగ్గరా ఉండే చేతికర్ర నీ దగ్గరా ఉందా?"